క్లుప్తంగా

రేపటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

మలక్‌పేట: మూసారంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ శ్రీకంచికామకోటి పీఠం కంచిపురం, శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం 24వ బ్రహ్మోత్సవాలు, శివ పార్వతీ అమ్మవార్ల 15వ బ్రహ్మోత్సవాలను ఈ నెల 29 తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉన్నవ పూర్ణచందర్‌రావు తెలిపారు. ద్వితీయ మహా కుంభాభిషేకం సందర్భంగా 29న అంకురార్పణ, 30న సామూహిక సుప్రభాత సేవ, శ్రీవారి ప్రత్యేక పూలంగి సేవ, రుద్రాభిషేకం, అగ్నిప్రతిష్ఠాపన, రుద్రాభిషేకం, మహా విశ్వ శాంతి యజ్ఞం, భక్తి సంగీతం, 31న ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, ఉంద్రాళ్లతో లక్ష్మీగణపతి హోమం, శ్రీవారి కల్యాణోత్సం, శివపార్వతి అమ్మవార్ల శాంతి కల్యాణం, గ్రామోత్సవ సేవ, మూసారంబాగ్ శ్రీనివాస మహిళా భక్తమండలి వారిచే విష్ణు సహస్ర నామ పారాయణ, లక్ష్మీపొండరీక మహాశాంతి యజ్ఞం ఉంటుందని వివరించారు. ఫిబ్రవరి 1 తేదీన నాగరాజు నాగదేవత వద్ద ఈశ్వరునికి సుబ్రహ్మణేశ్వరునికి లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం, పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, సుదర్శన చక్ర స్నానం, అవభృథోత్సవం ఊంజల్ సేవ, సన్మారాలు ఉంటాయని తెలిపారు. భక్తులు సకాలంలో విచ్చేసి స్వామి వారి కృపకు పాత్రులు కాగలని ఆయన కోరారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు



ఎమ్మెల్సీ కౌసిక్‌రెడ్డిపై ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి

చైతన్యపురి: తెలంగాణ గవర్నర్ తమిళిసైని అగౌరపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకుడు, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి శుక్రవారం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒక మహిళా గవర్నర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు యావత్ మహిళా లోకాన్ని అవమానం చేసేవిగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి ప్రజాప్రతినిధిగా ఉండేందుకు అర్హత లేదన్నారు. వెంటనే కేసు నమోదు చేసి శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

జవాను కుటుంబానికి ఆర్థిక సాయం



నరేష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న జవాన్లు

ఎల్‌బీనగర్: ప్రమాదంలో మృతి చెందిన తోటి జవాన్ కుటుంబానికి ఇతర జవాన్లు ఆర్థిక సాయం అందజేశారు. హనుమకొండ జిల్లా కమలాపురం మండలం శనిగరం గ్రామానికి చెందిన బండి బాబురావు, శారద దంపతుల కుమారుడు బండి నరేష్ కాన్పూర్‌లో సీఐఎస్ఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నాడు. బండి నరేష్ ఈ నెల 19వ తేదీన జరిగిన బస్సు ప్రమాదంలో మరణించాడు. ఆర్థికంగా నరేష్ కుటుంబానికి పెద్ద దిక్కు కావడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్న కుటుంబానికి ఆదుకోవాడినికి తోటి జవాన్లు ముందుకొచ్చారు. ఎల్‌బీనగర్‌కు చెందిన సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ జవాన్లు గురువారం శనిగారంలోని కుటుంబ సభ్యులను కలసి రూ. 1.21 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జవాన్లు సుధాకర్ రాథోడ్, మైనాల రమేష్, ఎలిగేటి శ్రీనివాస్, కోడిపాక కిరణ్, వేణుగోపాల్, జనగం రాజు, ప్రవీణ్, రాజేష్, మహేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యతోనే గుర్తింపు



సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

దిల్‌సుఖ్‌నగర్: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం ఉంటుందని మార్టిన్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ అంకితా రెడ్డి అన్నారు. శుక్రవారం మార్టిన్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రావు భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థుల ఉన్నతి కోసం అవలంభిస్తున్న పద్ధతులకు తల్లిదండ్రుల సహకారం అందించాలని కోరారు. దేశభక్తిని పెంపొందించే నృత్యాలు, భక్తి విలువలను పెంపొందించే అన్నమయ్య కీర్తనలు లాంటి మంచి సందేశాలతో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటకాలు ప్రేక్షకులను ఎంతో అలరించయన్నారు. రంగారెడ్డి జిల్లా విద్యాశాఖధికారి సుశీంద్రరావు, అనురాగ్ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస్, రిటైర్డ్ మేజర్, మోటివేటెడ్ స్పీకర్ సిస్టా, చైల్డ్ సైకాలజిస్ట్ విజయ తదితరులు పాల్గొన్నారు.

దోమలతో దడ

ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని నాగోలు డివిజన్ మల్లికార్జున్‌నగర్, అయ్యప్పనగర్ కాలనీల్లో దోమల బెడద రోజురోజుకూ తీవ్రంగా మారుతోంది. వర్షా కాలంలో వరద ముంపు.. వర్షాలు తగ్గిన తర్వాత దుర్గంధంతో కాలనీవాసులు అక్కడ నివాసం ఉండలేని పరిస్థితి నెలకొంటుందోంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.



దోమలకు నిలయమైన బండ్లగూడ చెరువు

- నాగోలు మల్లికార్జున్‌నగర్‌లో పొంగుతున్న మురుగు నీరు
- దుర్వాసనతో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- బండ్లగూడ చెరువు పరిసర కాలనీల్లో ప్రబలుతున్న వ్యాధులు

నాగోలు: మల్లికార్జున్‌నగర్, అయ్యప్పనగర్‌లో నిత్యం డ్రైనేజీ పొంగుతూ అక్కడ నుంచి వచ్చే దుర్వాసనతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొంగుతున్న డ్రైనేజీతో దోమలు వృద్ధి చెందిన కాలనీలో స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమకాటుతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- బండ్లగూడ చెరువు అనుకుని ఉండటంతో కాలనీలో దోమల వ్యాప్తితో ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని కాలనీ వాసులు వాపోతురు. కాలనీలోని సీనియర్ సిటిజన్స్, మహిళలు, పిల్లలు దోమల ప్రభావంతో ఎక్కువ సేపు బయట తిరగలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.
- సాయంత్రం 6 తరువాత అధికారులు ఆయా కాలనీలను సందర్శిస్తే పరిస్థితి వారికి పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతందంటున్నారు. అసలు జీహెచ్ఎంసీలో దోమలు నివారించే ఎంటమాలజీ విభాగం ఉందా? ఉన్నా ప్రయోజనం లేకుండా పోయిందని ఆయా కాలనీల ప్రజలు పేర్కొంటున్నారు. దోమకాటు కారణంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్నా జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులు ఫాగింగ్‌పై దృష్టి సారించలేకపోవడంపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- దోమలు అధికంగా ఉన్నాయని పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫాగింగ్ చేసేందుకు ఎవరూ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రజలు దోమకాటుకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారని పలువురు వాపోతున్నారు. విష జ్వరాలతో పాటు చర్మంపై దద్దుర్లు రావడం వంటి సమస్యతో బాధపడుతున్నట్లు తెలుపుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రైనేజీతో దోమల వృద్ధి



మల్లికార్జున్‌నగర్, అయ్యప్పనగర్ కాలనీలో డ్రైనేజీ పొంగి పొర్లుతుంది. అక్కడ పెద్ద ఎత్తున దోమలు వృద్ధి చెందుతున్నాయి. అధికారులు హడావుడి చేస్తున్నారు తప్ప దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవడం లేదు. రాత్రి సమయంలో దోమలతో కాలనీలో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి బండ్లగూడ చెరువు సమీపంలో ఉన్న కాలనీలో నిరంతరం ఫాగింగ్ చేయాలి. రెండు సంవత్సరాల క్రితం కాలనీలో డెంగీ జ్వరంతో ఇద్దరు మృతి చెందారు. – శ్రీనివాస్

ఉండలేక పోతున్నాం



మల్లికార్జున్‌నగర్‌లో పొంగుతున్న డ్రైనేజీ నుంచి వచ్చే దుర్వాసనతో కాలనీలో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించడం లేదు. మల్లికార్జున్‌నగర్, అయ్యప్పనగర్ కాలనీపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి కాలనీలో డ్రైనేజీ శాశ్వత పరిష్కారం చూపాలి. – యాదగిరిచారి



మల్లికార్జున్‌నగర్‌లో పొంగుతున్న మురుగు



అయ్యప్పనగర్ కాలనీలో...

ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



బాక్స్ డ్రైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌లో నెలకొనే వరద ముంపు సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శివసాయినగర్ కాలనీలో వరద ముంపు ప్రాంతాలలో నిర్మిస్తున్న బాక్స్ టైప్ డ్రైన్ పనులను స్థానిక కార్పొరేటర్ సుజాతనాయక్‌తో కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... జిల్లెలగూడ నుంచి వచ్చే వరద నీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ వరదనీటి పనులు సత్వరమే పూర్తిచేస్తే కాలనీవాసులకు వరద ముంపు నుంచి పూర్తిస్థాయిలో విముక్తి లభిస్తుందన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

'దొరల పాలనలో బీసీలకు అన్యాయం'

మన్సూరాబాద్: బడుగు, బలహీన వర్గాల ప్రజాప్రతినిధులు దొరల పాలనలో అణచివేతకు గురవుతున్నారని తెలంగాణ జన సమితి రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతూరి పుష్పనీల ధ్వజమెత్తారు. ఎల్‌బీనగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గానికి చెందిన జగిత్యాల మున్సిపల్ చైర్మన్ భోగ శ్రావణిపై అగ్రవర్గానికి చెందిన ఎమ్మెల్యే దొర రాజకీయంగా పెత్తనం చేపట్టి అవహేళనకు గురిచేశాడని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు గౌరవం లేదని, అడుగడుగా వివక్షకు గురవుతున్నారన్నారు. దొరలకు బానిసలుగా బతికే వాళ్లకు తప్ప వ్యక్తిత్వం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర మహిళలంతా ఏకమై దొరల రాజ్యం నుంచి తెలంగాణను విముక్తి చేయాలని కోరారు.

సహజ వనరులను కాపాడుకోవాలి

నాగోలు: తెలంగాణలో ఉన్న సహజ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు గోరా శ్యాంసుందర్‌గౌడ్, టీఆర్ఎస్ ఎల్‌బీనగర్ మాజీ ఇంచార్జ్ కాచం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్‌లో తెలంగాణ వనరుల పరిరక్షించాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్నో పోరాటాలు... ఎందరో ప్రాణాలు అర్పించినందునే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణలో జరుగుతున్న వనరుల దోపిడీని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే ఉద్యమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పల్లె వినయ్ కుమార్, ఎల్‌బీనగర్ అధ్యక్షుడు కేవీ రంగారెడ్డి, ఈదుల పరుశురాం మాదిగ, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుల్తాన్ యాదగిరి, ఉపాధ్యక్షుడు జిట్ట అయిల్‌రెడ్డి, కార్యదర్శి తిరుపతయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం



అధ్యక్షుడు ఆదర్ల మహేష్



సెక్రటరీ మధిర సత్యనారాయణ

మన్సూరాబాద్: ఆలిండియా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సదరన్ రీజియన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నాగోలు డివిజన్ బండ్లగూడలోని జీఎస్ఐ కార్యాలయ ఆవరణలోని మల్టీపర్పస్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ చైర్మన్‌గా ఆదర్ల మహేష్, వైస్ చైర్మన్లుగా లింగ్య, రాజశేఖర్, అరుణ్‌కుమార్, మల్లేష్, చంద్రయ్య, రీజనల్ సెక్రటరీగా మధిర సత్యనారాయణ, అసిస్టెంట్ సెక్రటరీలుగా చేకురేశ్వర్, రవీందర్, ప్రకాష్‌రావు, అమర్‌నాథ్, కోశాధికారిగా ఆనంద్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా యాదగిరి, వెంకటేష్, మనోజ్‌కుమార్, ఊశయ్య, కార్యవర్గ సభ్యులుగా దయానంద్, యాదయ్య, కిషన్‌రావు, రమణ, ధన్‌రాజ్ గోవింద్ గోఖలే, మహేష్, సురేందర్‌సింగ్, అనిల్‌కుమార్, అంజుబాహీ, జాన్‌ఫోనెరాజ్, శివ, అఖిలేష్‌సింగ్, మహిళా సభ్యురాలిగా విజయలక్ష్మి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జీఎస్ఐ డైరెక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

కార్పొరేటర్ చింతల అరుణ



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న కార్పొరేటర్

నాగోలు: విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ విద్యార్థులకు సూచించారు. ప్రధానమంత్రి పరీక్షపే చర్చ–2023 కార్యక్రమం శుక్రవారం నాగోలు ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అరుణ పాల్గొన్నారు. పెయింటింగ్, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... విద్యార్థుల సృజన, ఉత్సాహం చూసాక, పరీక్షలను– వాటి ఒత్తిడిని తప్పకుండా జయిస్తారన్నారు. ప్రొజెక్టర్ ద్వారా పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని వీక్షించి ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులను ఉద్దేశించి రచించిన ఎక్సమ్ వారియర్స్ పుస్తకాన్ని స్కూల్ ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు కటకం నర్సింగ్‌రావు, పద్మారెడ్డి, బాలకృష్ణ గౌడ్, రావుల శ్రీనివాస్, రాఘవ చారి ప్రభాకర్, నరేంధర్ సింగ్, రాజేష్, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

సాహిత్య పరిశోధనపై వర్క్‌షాప్

సైదాబాద్: రెవిన్యూబోర్డ్ కాలనీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (ఎన్ఐఐఎంహెచ్) కార్యాలయంలో సాహిత్య పరిశోధనపై రెండు రోజుల వర్క్‌సాప్ ప్రారంభమైంది. మొదటిరోజైన శుక్రవారం సంస్థ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ డైరెక్టర్ జీ.పి.ప్రసాద్ స్వాగతోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా యునాని రాతప్రతుల డిజిటల్ కాపీల సేకరణ, కాటలాగ్ తయారీ లక్ష్యంతో ఎన్ఐఐఎంహెచ్, తెలంగాణ ప్రభుత్వ ఓరియంటల్ మ్యాన్యుస్క్రిప్ట్ లైబ్రరీ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఇరు సంస్థలు ఒప్పంద మార్పిడి చేసుకున్నారు. అనంతరం న్యూఢిల్లీలోని రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్‌కు చెందిన విజయ్‌పాల్‌శాస్త్రి వైద్య సంబంధిత తాళపత్ర గ్రంథాల క్లిష్టమైన సంస్కరణల గురించి వివరించారు. వర్క్‌షాపునకు దేశంలోని వివిధ సంస్థలకు చెందిన 26 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. సంస్థ అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ బిస్వో రంజన్ దాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్

బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు



ఐడియల్ కాలేజీ విద్యార్థులతో ఏసీపీ శంకర్‌రాజు, ప్రిన్సిపాల్ మధుసూదన్

మలక్‌పేట: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను విజయవంతంగా అరికట్టవచ్చని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ ఐడియల్ డిగ్రీ ఉమెన్స్ కాలేజీలో శుక్రవారం ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ×ట్రాఫిక్ సేఫ్టీ నిబంధనలꝰపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... నగర పోలీస్ కమిషనర్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి తప్పనిసరగా ట్రాఫిక్ నింబంధనలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. వాహనదారులు ట్రాఫిక్ సిబ్బందికి సహకరిస్తూ వారి ఆదేశాలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ పొందవచ్చన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని... ఇతర వాహనదారులకు ఆటంకం కలగకుండా డ్రైవింగ్ చేయాలని కోరారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ మధుసూదన్, ఏవో రాజశేఖర్‌రెడ్డి, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర రాజకీయాల్లో విజయశాంతికి ప్రత్యేక గుర్తింపు



విజయశాంతికి అభినందనలు తెలిపిన కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో విజయశాంతికి ప్రత్యేక గుర్తింపు ఉందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ సీనియర్ నాయకురాలు, సినీనటి విజయశాంతి రాజకీయ ప్రస్థానం 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో శుక్రవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయశాంతిని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కలిసి శాలువాతో సన్మానించి శుభాభినందనలు తెలిపారు. అనంతరం మన్సూరాబాద్‌లోని తన కార్యాలయంలో కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో విజయశాంతి కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. సినీ రంగంలో ఎన్నో విభిన్నమైన, మరవలేని పాత్రలు పోషించారని తెలిపారు.

ఎన్టీఆర్‌నగర్‌లో చెత్తను తొలగించండి



ఎన్టీఆర్‌నగర్‌లో చెత్తను పరిశీలిస్తున్న యూత్ కాంగ్రెస్ నేతలు

దిల్‌సుఖ్‌నగర్: ఎన్టీఆర్‌నగర్‌లో పేరుకపోయిన చెత్తను వెంటనే తొలగించాలని యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్ నుంచి ఎన్టీఆర్ నగర్ వెళ్లే ప్రధాన రహదారి పొడవునా ప్రహరీ వెంట మొత్తం చెత్త వేయడంతో కాలనీ ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న చిలుక ఉపేందర్ రెడ్డి కాలనీ వాసులతో కలసి ఎన్టీఆర్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ... కాలనీ రోడ్లపై చెత్త పేరుకుపోవడంతో కాలనీవాసులు లోపలికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భరించలేని దుర్గంధం వెదజల్లుతోందన్నారు. వెంటనే సంబంధిత అధికారుల స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు అల్లేటి కిరణ్ కుమార్, రాజు నాయక్, శేఖర్ ముదిరాజ్, కళ్యాణ్ , భాస్కర్ నాయక్, ప్రేమ్ నాయక్, హరి బాబు, గోపి, బాలు, జహంగీర్, విజయ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చ' విద్యార్థులకు ప్రేరణ



సరూర్‌నగర్ హైస్కూల్‌లో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న సామ రంగారెడ్డి



జ్ఞాపిక అందజేస్తున్న వీరేంద్రబాబు యాదవ్

చైతన్యపురి: ప్రధాని నరేంద్రమోడీ నిర్వహిస్తున్న 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం 9, 10వ తరగతులు చదివే విద్యార్థులకు ప్రేరణ వంటిదని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా పరీక్షల ఒత్తిడిని విడిచి పెట్టి వారి కలలు, లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈ కార్యక్రమం ఉపకరిస్తుందన్నారు. పరీక్షా పే చర్చ ఆరవ ఎడిషన్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సామ రంగారెడ్డి విద్యార్థులకు సూచించారు.

ఒత్తిడి తగ్గించేందుకే...

సైదాబాద్: పరీక్షల సమయంలో విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ప్రధాని మోడీతో పరీక్షా పే చర్చా కార్యక్రమం దోహదపడుతుందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్ర బాబు యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఐఎస్ సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో పరీక్షా పే చర్చా కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు అక్కడ ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్‌పై మోడీ సందేశాన్ని ఆలకించారు. బీజేపీ నాయకులు సహదేవ్‌యాదవ్, అమర్‌నాథ్, సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయించేందుకు యత్నించిన వ్యక్తికి జైలు శిక్ష

రంగారెడ్డిజిల్లాకోర్టులు: చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో నమోదైన గంజాయి విక్రయానికి ప్రయత్నించిన కేసులో నిందితుడు ఆడెపు సుధాకర్(36) అనే వ్యక్తికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 25 వేల జరిమానా విధిస్తూ 1వ అదనపు జిల్లా కమ్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఆర్.తిరుపతి తీర్పు చెప్పారు. 1వ అదనపు జిల్లా కమ్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు ఏపీపీ కొంగర రాజి రెడ్డి కథనం మేరకు... నిందితుడు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న తరుణంలో కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయించాలని నిశ్చయించుకున్నాడు. విజయవాడకు చెందిన రెడ్డి అనే విక్రయదారుడి నుంచి నాలుగు కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దాన్ని వేణుగోపాల్ అనే వ్యక్తికి హైదరాబాద్‌లో విక్రయించేందుకు తన ఆటోలో తరలిస్తుండగా కొత్తపేట నక్షత్ర హోటల్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న చైతన్యపురి పోలీసులు నిందితుడి నుంచి నాలుగు కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన ఇన్‌స్పెక్టర్ గురు రాఘవేంద్ర, డీఐ మన్ మోహన్, ఎస్ఐ రత్నం, సిబ్బంది రవి నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి శుక్రవారం నిందితుడికి పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

'నార్ముల్' పాల ఉత్పత్తులను ఆదరించాలి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



నార్ముల్ పాల ఉత్పత్తులను చూపిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

హయత్‌నగర్: రైతుల సహకారంతో నడుస్తున్న నార్ముల్ (నల్లగొండ రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సమాఖ్య లిమిటెడ్) మదర్ డెయిరీ పాల ఉత్పత్తులు ఎంతో నాణ్యమైనవి అని, నగర ప్రజల ఆదరణ పొందుతున్న ఈ పాల ఉత్పత్తులను అందరికీ అందుబాటులో ఉంచాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హయత్‌నగర్‌లోని పెద్దమ్మగుడి చౌరస్తా వద్ద నార్ముల్ ఔట్‌లెట్ పార్లర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పాల అమ్మకంలో నగరం పెద్ద మార్కెట్ అని అనేక డెయిరీలు ఈ మార్కెట్‌లో పోటీ పడుతున్నా రైతుల సహకారంతో నడుస్తున్న నార్ముల్ పాల ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని కోరారు. రైతులకు అండగా ఉంటున్న నార్ముల్ సంస్థ ఔట్‌లెట్‌ల ఏర్పాటుతో యువత స్వయం ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. నార్ముల్ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతూ... ఉత్పత్తిదారుల నుంచి సేకరించిన 24 గంటలలోపే వినియోగదారులకు పాలను అందిస్తున్నామని, పాలతోపాటు నాణ్యమైన పాల ఉత్పత్తులను తయారు చేస్తున్నామని తెలిపారు. నార్ముల్ ఎండీ అశోక్‌కుమార్, ఏజీఎం జి.వి.ఎన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, పెద్దమ్మ టెంపుల్ చైర్మన్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పిడుగు శ్రీనివాస్, రాజ్ అండ్ రాజ్ అసోషియేట్ చైర్మన్ కొండాపురం రాజు, నాయకులు భాస్కర్‌సాగర్, గుడాల మల్లేష్ పాల్గొన్నారు.